ప్రజాశక్తి
ఆదివారం 4 డిసెంబరు 2022
5
శ్రీకాకుళం

అరసవల్లిని సందర్శించిన ఎమ్మెల్సీ



జ్ఞాపికను అందజేస్తున్న వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి ఆలయాన్ని శనివారం శాసనమండలి సభ్యులు డాక్టర్ పి.సురేష్‌బాబు సందర్శించారు. వీరికి ఆలయ అర్చకులు సంప్రదాయ బద్ధంగా స్వాగతించారు. ఆలయంలో స్వామివారికి నిర్వహించే పలు సేవల్లో పాల్గొన్న అనంతరం అనివేటి మండపంలో సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వరరావు స్వామివారి శేష వస్త్రాన్ని కప్పి జ్ఞాపికను అందజేశారు. ఆయనతో పాటు విజయనగరం జిల్లాకు చెందిన మాజీ ఎంపీ డాక్టరు డివిజి.శంకరరావు, బిసి కార్పొరేషన్ చైర్మన్ ఎన్.నాయుడుబాబు, బిసి కార్పొరేషన్ డైరెక్టర్ కెవి సత్యనారాయణరాజు, ఎం.సత్యనారాయణలు ఉన్నారు.

మోడీని గద్దె దించితేనే పేదలకు న్యాయం

- కార్మికుల సంక్షేమంపై నోరెత్తని ప్రధాని
- కార్మికులు బానిసలుగా ఉండాలన్నదే కేంద్ర ప్రభుత్వ ఆలోచన
- సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.గఫూర్
- శ్రీకాకుళంలో ఘనంగా ప్రారంభమైన సిఐటియు 11వ మహాసభ



శ్రీకాకుళం నగరంలో భారీ ప్రదర్శనగా వెళ్తున్న సిఐటియు నాయకులు, కార్మికులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించితేనే పేదలకు న్యాయం జరుగుతుందని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.గఫూర్ అన్నారు. సిఐటియు జిల్లా 11వ మహాసభ సందర్భంగా శ్రీకాకుళం నగరంలోని ఏడు రోడ్ల కూడలి నుంచి జిటి రోడ్డు మీదుగా స్థానిక డైమండ్ పార్కు వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం పెద్దకోట పోలినాయుడు నగర్‌లో సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.సురేష్‌బాబు అధ్యక్షతన బహిరంగసభ నిర్వహించారు. దేశ వ్యాప్తంగా వివిధ కేంద్ర ప్రభుత్వ పథకాల్లో పని చేస్తున్న స్కీం వర్కర్ల సంక్షేమంపై బిజెపి ప్రభుత్వం ఏడున్నర ఏళ్లలో ఒక్క సారి కూడా మాట్లాడలేదని విమర్శించారు. అంగన్వాడీలకు గ్రాట్యూటీ చెల్లించాలని సుప్రీం కోర్టు తీర్పునిచ్చినా దాన్ని అమలు చేసేందుకు మోడీ ప్రభుత్వం కనీసం ఆలోచన చేయడం లేదన్నారు. జనం వ్యతిరేకిస్తారనే మధ్యాహ్న భోజనం, అంగన్వాడీలను బిజెపి ప్రభుత్వం కొనసాగిస్తుందే తప్ప జనం మీద ప్రేమతో కాదని చెప్పారు. మోడీ ప్రేమంతా అదానీ, అంబానీలపైనే ఉందన్నారు. బ్యాంకులకు లక్షల కోట్లను ఎగ్గొట్టిన పెట్టుబడిదారులను కేంద్ర ప్రభుత్వం కాపాడుతోందన్నారు. పెట్టుబడిదారులు, సంపన్నులకు రాయితీలను ఇస్తూ పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలను విపరీతంగా పెంచి పేదలపై మాత్రం తీవ్ర భారం మోపుతోందని విమర్శించారు. మోడీ విధానాల్లో మార్పు రావాలని అన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 29 చట్టాలను రద్దు చేసి బిజెపి ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి చర్చ లేకుండానే పార్లమెంట్‌లో ఆమోదించిందని చెప్పారు. కార్మికులు బానిసలుగా ఉండాలన్నదే మోడీ ఆలోచన అని విమర్శించారు. విశాఖ ఉక్కు, రైల్వేలు, విమానాశ్రయాలు ఇతర ప్రభుత్వరంగ సంస్థలను మోడీ ప్రభుత్వం ప్రయివేటు పెట్టుబడిదారులకు కట్టబెడుతోందని, దీన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. ప్రయివేటీకరణ, కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా వచ్చే ఏడాది ఏప్రిల్‌లో 10 లక్షల మందితో ఢిల్లీని చుట్టుముడతామని చెప్పారు

ప్రజల కష్టనష్టాలతో సంబంధం లేకుండా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన రైతు వ్యతిరేక నల్ల చట్టాలు, కార్మికులకు నష్టం కలిగించే లేబర్ కోడ్, సిఎఎ బిల్లులకు వైసిపి మద్దతు తెలిపిందని గుర్తు చేశారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, ఉత్తరాంధ్ర, రాయలసీమకు వెనుకబడిన ప్యాకేజీ ఇవ్వకపోయినా బిజెపి ప్రభుత్వాన్ని జగన్మోహన్‌రెడ్డి అడగడం లేదన్నారు. కార్మికులకు కనీస వేతనం పెంచుతూ వారం రోజుల్లో జిఒ ఇచ్చేస్తామంటూ చెప్పిన జగన్మోహన్‌రెడ్డి మూడున్నర ఏళ్లు అయినా దిక్కు లేదన్నారు. ప్రజలు, కార్మికుల సంక్షేమం వదిలి విశాఖలో భూముల ఆక్రమణ, రుషికొండ కొల్లగొట్టడంపైనే వైసిపి నాయకులు దృష్టి పెడుతున్నారని విమర్శించారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, ఉత్తరాంధ్ర, రాయలసీమకు వెనుకబడిన ప్యాకేజీ ఇవ్వకపోయినా బిజెపిని జగన్మోహన్‌రెడ్డి అడగడం లేదన్నారు

సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.గోవిందరావు మాట్లాడుతూ జిల్లాలో అసంఘటితరంగ కార్మికులు కనీస హక్కులు లేకుండా తీవ్ర శ్రమ దోపిడీకి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో 100 పడకల అధునాతన ఇఎస్ఐ ఆస్పత్రి నిర్మించాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా అధ్యక్షుడు ఆర్.సురేష్‌బాబు మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్మిక చట్టాలను కార్పొరేట్లకు అనుకూలంగా మార్చడంతో జిల్లాలో ఆ ప్రభావం కనిపిస్తోందన్నారు. సమ్మె చేస్తున్న కార్మికులను పలు యాజమాన్యాలు తొలగిస్తున్నాయని చెప్పారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలో కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సిఐటియు సాగించిన పోరాటాలు, విజయాలను వివరించారు. మూడేళ్ల కాలంలో సిఐటియు అనేక సామాజిక సేవా కార్యక్రమాలను చేపట్టిందని గుర్తు చేశారు. శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ కె.నాగమణి మాట్లాడుతూ ఆశాలకు ఫేస్ రికగ్నేషన్ అమలు చేయాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. మహిళలపై దాడులు, అత్యాచారాలు పెరుగుతున్నా ప్రభుత్వం వాటిని నియంత్రించడం లేదన్నారు. మధ్యాహ్న భోజన పథకం జిల్లా అధ్యక్షురాలు అల్లు మహాలక్ష్మి, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు డి.సుదర్శనం మాట్లాడుతూ స్కీం వర్కర్లకు గౌరవ వేతనం చెల్లిస్తున్న ప్రభుత్వం వారికి ఏ సంక్షేమ పథకం అమలు చేయకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో సిఐటియు సీనియర్ నాయకులు విజికె మూర్తి, నాయకులు సిహెచ్ అమ్మన్నాయుడు, అల్లు సత్యనారాయణ, ఎన్‌వి రమణ, ఎం.ఆదినారాయణమూర్తి, కె.సూరయ్య, కె.గురునాయుడు, వై.చలపతిరావు, కె.సూరయ్య, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.గఫూర్

ఉత్సాహంగా... ఉత్తేజంగా

శ్రీకాకుళం నగరంలో సిఐటియు జిల్లా 11వ మహాసభ ఉత్సాహంగా, ఉత్తేజంగా ప్రారంభమయ్యాయి. జిల్లా నలుమూలల నుంచి వేలాది మంది కార్మికులు తొలుత నగరంలోని ఏడు రోడ్ల కూడలికి చేరుకున్నారు. ఉదయం 11.30 గంటలకు ర్యాలీగా బయలుదేరారు. 11వ మహాసభ సూచికంగా 11 మంది మహిళలు సిఐటియు జెండాలను చేతపట్టి ర్యాలీ ముందు నడిచారు. డప్పు, వాయిద్యాలతో కళాకారులు సందడి చేశారు. జిటి రోడ్డు మీదుగా డైమండ్ పార్కుకు చేరుకున్నారు. అక్కడ నిర్వహించిన బహిరంగ సభలో వక్తల మాటలను కార్యకర్తలు ఆసక్తిగా విన్నారు. అనంతరం స్థానిక టిటిడి కళ్యాణ మండపంలో నిర్వహించిన ప్రతినిధుల సభలో ఆహ్వాన సంఘం అధ్యక్షులు, ఎన్‌జిఒ అసోసియేషన్ రాష్ట్ర సహాధ్యక్షులు చౌదరి పురుషోత్తంనాయుడు ప్రారంభోపన్యాసం చేశారు. ఆర్థిక, సామాజిక, రాజకీయ, పారిశ్రామికరంగాల్లో ప్రస్తుతం ఉన్న సంక్లిష్ట పరిస్థితుల్లో 11వ మహాసభకు ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. కార్మికవర్గంపై జరుగుతున్న దాడిని తిప్పి కొట్టేందుకు మహాసభలో తీసుకున్న నిర్ణయాలు, చర్చలు ఎంతగానో దోహదపడతాయన్నారు. అనంతరం సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు కార్యదర్శి నివేదికను ప్రవేశ పెట్టారు. ప్రతినిధుల సభలో రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ నర్సింగరావు పాల్గొన్నారు.

ఇంటర్నేషనల్ పోటీల్లో
మందస వాసి ప్రతిభ
లాంగ్ జంప్‌లో తృతీయ స్థానం కైవసం



రజత పతకంతో సోమేశ్వరరావు

ప్రజాశక్తి - మందస

కౌలాలంపూర్‌లోని మలయాలో శనివారం జరిగిన కౌలాలంపూర్ ఇంటర్నేషనల్ మాస్టర్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్‌లో పట్టణంలోని బోయవీధికి చెందిన లావేటి సోమేశ్వరరావు ప్రతిభ చాటాడు. లాంగ్ జంప్‌లో తృతీయ స్థానంలో నిలిచి రజత పతకాన్ని సాధించి, అందరి దృష్టిని ఆకర్షించాడు. ఈయన 2019 ఇండో బంగ్లాదేశ్ పోటీల్లో 400 మీటర్ల పరుగు పందెంలో పాల్గొని రజత పతకం గెలుచుకొని అంతర్జాతీయ పోటీలకు అర్హత సాధించాడు. సామాన్య కుటుంబమైన లావేటి రామారావు, రమణమ్మల కుమారుడైన సోమేశ్వరరావు తెలంగాణ ఆర్టీసీ డిపార్టుమెంట్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. అంతర్జాతీయ పోటీల్లో తృతీయ స్థానం కైవసం చేసుకోవడం తనకు చాలా ఆనందంగా ఉందని, తన కల నెరవేరినట్లు ఆయన తెలిపారు. మందసకు చెందిన యువకుడు బాగా ఆడి మంచి గుర్తింపు తెచ్చుకోవడంతో పలువురు క్రీడాభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఎఫ్‌ఎ-2 పరీక్షల్లో గందరగోళాన్ని సరిచేయాలి

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

ఒకటి నుంచి పదో తరగతి విద్యార్థులకు జరుగుతున్న ఎఫ్‌ఎ-2 పరీక్షల్లో ప్రశ్నాపత్రాలను ఎస్‌సిఇఆర్‌టి తయారు చేస్తున్నప్పటికీ వాటిని జిల్లా స్థాయిలో డిసిఇ బోర్డ్ ముద్రించి పాఠశాలలకు సరఫరా చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చౌదరి రవీంద్ర, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శి పి.అప్పారావు, ఎస్.కిషోర్‌కుమార్ డిమాండ్ చేశారు. శనివారం వారు ఒక ప్రకటనను విడుదల చేశారు. విద్యార్థులకు ప్రశ్నాపత్రాలు సరఫరా చేయకుండా వాట్యాప్ ద్వారా పంపించడం వల్ల బోర్డు మీద రాయడం, బొమ్మలు గీయడం ఇబ్బందిగా మారుతోందని తెలిపారు. 1, 2, 3 తరగతుల పిల్లలు బోర్డుపై రాసిన ప్రశ్నా పత్రాన్ని ఎలా రాయగలరని ప్రశ్నించారు. విద్యాశాఖ అధికారులు కనీస ఆలోచన లేకుండా పరీక్షల నిర్వహణలో ఉపాధ్యాయులు, విద్యార్థులపై ఒత్తిడి తీసుకురావడం సరికాదని పేర్కొన్నారు. ఈ రకంగా పరీక్షలు నిర్వహణ కష్ట సాధ్యమని, అందువల్ల రాబోయే కాలంలో నిర్వహించే పరీక్షలు డిసిఇ బోర్డు ద్వారా నిర్వహించాలని డిమాండ్ చేశారు. పరీక్షల నిర్వహణకు ప్రత్యేకమైన గ్రాంట్ మంజూరు చేసి ముందుగా ప్రశ్నాపత్రాలను పంపించాలని కోరారు. వాటిని జెరాక్స్ తీసైనా సరఫరా చేయాలని తెలిపారు. నిర్దిష్టమైన ప్రణాళిక లేకుండా పరీక్షలకొక విధానాన్ని అమలు చేయడం వల్ల అయోమయ పరిస్థితులు నెలకొంటున్నాయని, పరీక్షలు విధానంలో గందరగోళాన్ని సరిచేసి, సజావుగా పరీక్షలు నిర్వహించాలని వారు కోరారు.



దోచుకోవడం, దాచుకోవడమే జగన్ లక్ష్యం
ఎంపీ రామ్మోహన్‌నాయుడు

(6లో)

ఉత్సాహంగా ఫెన్సింగ్ పోటీలు

(6లో)

మీరే మాకు స్ఫూర్తి ప్రదాతలు

- వికలాంగులు కాదు ప్రతిభావంతులు
- జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ



వికలాంగులకు బహుమతులను ప్రదానం చేస్తున్న విజయ, కృష్ణదాస్, కలెక్టర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

సమాజంలో సాధారణ పౌరుల కంటే వికలాంగులు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, మీరే మాకు స్ఫూర్తి ప్రదాతలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ కొనియాడారు. వికలాంగుల శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ వికలాంగ దినోత్సవం జెడ్‌పి సమావేశ మందిరంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ మాట్లాడుతూ వికలాంగులకు సమాన అవకాశాలు, హక్కులు కల్పించి వారందరినీ సమాజాభివృద్ధిలో భాగం చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. రాజకీయ, సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక పరంగా వికలాంగులు ఎదుగుదలను ప్రోత్సహించేలా ఈ దినోత్సవం ముఖ్య ఉద్దేశమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తూ వారిని ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. వికలాంగులకు అవకాశాలు కల్పిస్తే ఇతరులకు తీసిపోరని ఆమె చెప్పారు. ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ మాట్లాడుతూ వికలాంగులు సమాజంలో ఇతరుల కంటే తక్కువేమీకాదని, ఇటీవల జరిగిన అంతర్జాతీయ వికలాంగుల క్రీడల్లో గెలుపొందిన విజేతలే ఇందుకు నిదర్శనమన్నారు. సంకల్పం బలంగా ఉంటే ఏదైనా సాధించవచ్చని మీరు నిరూపిస్తున్నారని, మీరే మా స్ఫూర్తి ప్రదాతలని అన్నారు. కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ మాట్లాడుతూ స్వావలంబన యాప్ ద్వారా వికలాంగుల విద్య సమాచారం ఉంచామని, తద్వారా ఇటీవల ఆరు కంపెనీల్లో 46 మందికి ఉపాధి లభించిందన్నారు. సదరం ధ్రువీకరణ పత్రాల జారీలో తక్షణమే మంజూరయ్యేలా చూస్తున్నామని, సచివాలయ స్థాయిలో సమస్యల పరిష్కారం అయ్యేలా చర్యలు చేపట్టినట్లు చెప్పారు. ప్రభుత్వ నియామకాల్లో 3శాతం రిజర్వేషన్ అమలవుతుందని, బ్యాక్ లాగ్ పోస్టుల భర్తీలో చర్యలు తీసుకున్నట్లు వివరించారు. 239 మందికి వివిధ ప్రభుత్వశాఖల్లో ఉద్యోగ నియామకాలు కల్పించామని గుర్తుచేశారు. ఈ సందర్భంగా 2022-23లో 18 మందికి ల్యాప్ టాపులు, ఎన్‌హెచ్‌ఎఫ్‌డిసి ద్వారా 27 మందికి రూ.87 లక్షల రుణాలు, రూ.45 లక్షల విలువ గల మూడు చక్రాల మోటార్ వాహనాలను 36 మందికి, నలుగురికి టచ్ ఫోన్లు, పది మందికి ట్రై సైకిళ్లను పంపిణీచేశారు. బెహరా మనో వికాస కేంద్రం విద్యార్థులు చేసిన వికలాంగుల పట్ల నిర్లక్ష్యం వద్దు లఘు నాటిక ఆద్యంతం అలరించింది. జిల్లా స్థాయి ఆటల పోటీల్లో గెలుపొందిన విజేతలకు ధ్రువ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో శాసనమండలి సభ్యులు సురేష్‌కుమార్, వికలాంగుల శాఖ సహాయ సంచాలకులు ఎం.కిరణ్‌కుమార్, డ్వామా పీడీ జి.వి.చిట్టిరాజు, జిల్లా పర్యాటక అధికారి ఎన్.నారాయణరావు, సెట్ శ్రీ సిఇఒ బి.వి.ప్రసాదరావు, అదనపు జిల్లా వైద్యఆరోగ్య శాఖాధికారి డా.ఎన్.అనురాధ, ఇతర అధికారులు, వికలాంగులు, తదితరులు పాల్గొన్నారు.

'జయహో బిసి' మహాసభకు తరలిరావాలి

రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

'జయహో బిసి' మహాసభకు తరలిరావాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి మంత్రి బొత్స సత్యనారాయణ పిలుపునిచ్చారు. శనివారం వైసిపి జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి బొత్స మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఏలూరులో జగన్మోహన్‌రెడ్డి బిసి డిక్లరేషన్ ప్రకటించారని, అందుకు అనుగుణంగానే మూడున్నరేళ్లలో ఆర్థికంగా, సామాజికంగా బిసిలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చామని తెలిపారు. రాష్ట్రంలో బిసిలకు రూ.80వేల కోట్లు నేరుగా వారి ఖాతాలకే జమ చేసి ఆర్థికంగా పైకి తీసుకురావడం జరిగిందన్నారు. గత ప్రభుత్వంలో రూ.వెయ్యి, రెండు వేలతో బిసిలకు కుట్టు మిషన్లు, ఇస్త్రీ పెట్టెలు, గెడ్డం గీసుకునే సామగ్రి ఇచ్చేవారని, అందుకు భిన్నంగా ఆర్థిక ప్రయోజనం కల్పించి, వారి పిల్లలు ఉన్నత చదువులు చదువుకునేందుకు ఆర్థిక ప్రయోజనం కల్పిస్తున్నట్లు చెప్పారు. తాము బిసిలకు చేసింది చెప్పుకునేందుకు మాత్రమే సభ నిర్వహిస్తున్నామన్నారు. ఈ సభకు జిల్లాలో ఎన్నికైన వార్డు మెంబర్లు మొదలు, మంత్రుల వరకు అన్ని పదువుల్లో ఉన్న బిసి నేతలంతా 7న విజయవాడలో జరిగే సభకు తరలిరావాలని కోరారు.

ఇది అభ్యర్థన కాదని, సిఎం ఆదేశమన్నారు. బస్సులు వేస్తున్నామని, భోజన, వసతి సదుపాయం కల్పిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా మంత్రి సీదిరి అప్పలరాజు మాట్లాడుతూ చంద్రబాబు హయాంలో బిసిలు అవమానించబడ్డారని, నేడు ఆ పరిస్థితి లేదన్నారు. తొలుత జయహో బిసి మహాసభ, బిసిలే వెన్నెముఖ పేరిట పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్, విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, జెడ్‌పి చైర్‌పర్సన్ విజయ, ఎమ్మెల్యేలు రెడ్డి శాంతి, జి.కిరణ్‌కుమార్, ఎమ్మెల్సీలు దువ్వాడ శ్రీనివాస్, సురేష్, కిల్లి కృపారాణి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బొత్స సత్యనారాయణ

ఫ్యాను గాలితో గ్రూపుల గరగర



రాష్ట్ర రాజకీయాల నీరు వేడెక్కడమే కాదు సలసల కాగుతున్నాయి. ఆ నీళ్లు ఎప్పుడు ఎవరిపైన ఏ రూపంలో పడతాయన్నది ఎవరూ ఊహించలేని పరిస్థితిలో రాజకీయ వాతావరణం ఉంది. వచ్చే శాసనసభ ఎన్నికల్లో వైసిపి గెలవడం అంత తేలికకాదని పోలింగ్ రోజు యుద్ధమే జరుగుతుందని వైసిపి ఎమ్మెల్సీ సి.రామచంద్రయ్య ఇప్పటికే వ్యాఖ్యానించడం చూశాం. ఇలాంటి పరిస్థితుల్లో జిల్లా రాజకీయాలను వేరు చేసి చూడలేం. 175 సీట్లు గెలవాలన్న లక్ష్య సాధన దిశలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి జిల్లాల వారీ, నియోజకవర్గాల వారీ, నిరంతర సర్వేలను మూడు నెలలకు ఒక సారి చేపడుతున్న విషయం అందరికీ తెలిసిందే. ఈ సర్వే రెండు రూపాల్లో సాగుతున్నట్లు తెలిసింది. ప్రజల్లో పార్టీకి ఏ రూపంలో ఆధరణ లభిస్తుందన్నది ప్రత్యేకంగా సర్వేలు నిర్వహిస్తున్నట్లు సమాచారం. అదే సమయంలో ఆయా నియోజకవర్గాల్లో ఎవరెవరు వచ్చే ఎన్నికలకు అభ్యర్థులుగా ఉంటే బాగుంటుందన్నది ప్రజాభిప్రాయాన్ని తీసుకుంటున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. సర్వేకు సంబంధించి బహుముఖంగా చేపట్టినట్లు తెలిసింది. ప్రధానంగా ప్రభుత్వ ఇంటెలిజెన్స్‌తోపాటు సొంత మీడియా ద్వారా సమాచార సేకరణ, పికె మార్గ దర్శకత్వంలో సర్వే బృందాలు ఆయా జిల్లాల్లో అత్యంత విశ్వాసనీయతగా ఉన్న సీనియర్ నేతల సమాచారంతో పాటు ఇతర మార్గాలను చేపట్టినట్లు తెలిసింది. సర్వేలకు సంబంధించి కొన్ని సూచికలు మార్గదర్శకంగా రూపొందించినట్లు సమాచారం. వీటిలో ఎంత శాస్త్రీయత ఉంటుందో ఆచరణలో తేలాల్సి ఉంది. తన సర్వేలతో గెలుపు ఖాయమనుకున్న చంద్రబాబు ఘోర ఓటమి పాలైన చరిత్ర మరిచిపోలేము.

జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల్లోనూ ఇప్పటికే రెండు రకాల సర్వేలను పూర్తి చేసినట్లు తెలిసింది. ఆ సర్వేల సారాంశం ఏమిటంటే ప్రజల్లో పార్టీకి మంచి ఆధరణ ఉందని, తన గెలుపునకు ఢోకా లేదని గుర్తించినట్లు తెలిసింది. అదే సమయంలో అభ్యర్థులుగా వచ్చే వ్యక్తుల ప్రభావం విషయంలోనూ, వారిపై ప్రజల ఆదరణ విషయంలోనూ, కొంత ప్రతికూలత కనిపించిందని గుర్తించినట్లు తెలిసింది. అందుకే ఏయే నియోజకవర్గంలో ఎవరు అభ్యర్థి అయి ఉంటే బాగుంటుందన్నది గుర్తించేందుకు ప్రతీ నియోజకవర్గంలోనూ ఇప్పుడున్న నేతలతో పాటు, మరో ఇద్దరు, ముగ్గురు ఆశావహుల విషయంలోనూ సర్వే చేసినట్లు తెలిసింది. వ్యక్తిగత బలం ప్రభావంతో విజయం సాధించే వారిలో మొదటి స్థానంలో మంత్రి ధర్మాన ప్రసాదరావు నిలిచారని అత్యంత విశ్వసనీయంగా తెలిసింది. అందుకు కారణం ఆ నియోజకవర్గంలోని వైసిపిలో ధర్మాన వ్యతిరేక గ్రూపులేవీ లేకపోవడం కావచ్చు. మిగిలిన అన్ని నియోజకవర్గాల్లో తరతమ తేడాల్లో గ్రూపుల గోల ఎక్కువగా ఉంది. నియోజకవర్గాల వారీ సమావేశాలు పెట్టుకొని, ఇన్‌ఛార్జిలను తొలగించండి, ఈ సారి టిక్కెట్ ఇవ్వొద్దు, టిక్కెట్ ఇచ్చినా ఓడిస్తామన్న అసమ్మతి రాగాలు బలంగా వినిపించడం చూస్తున్నాం. వైసిపి కాంగ్రెస్ వారసత్వ పార్టీ కనుక ఆ పార్టీలోనూ వెళ్లానుకొని ఉన్న గ్రూపు రాజకీయాలు వైసిపిలో ప్రవేశించాయి. కాంగ్రెస్‌ను ఓడించడానికి ప్రతిపక్షం అవసరంలేదు. స్వపక్షంలోని అసమ్మతి గ్రూపు చాలన్న నానుడి ఉంది. జిల్లాలోనూ పలుసార్లు ఆ నానుడి నిజమవడం చూశాం. వచ్చే ఎన్నికల్లో జిల్లాలో కొందరు వైసిపి అభ్యర్థులు అలాంటి పరిస్థితిని ఎదుర్కోనున్నారని రాజకీయ పరిణామాలు కనిపిస్తున్నాయి.

ఇచ్ఛాపురం నియోజకవర్గంలో గ్రూపుల గోల రణగొణ ధ్వనులుగానే ఉంది. కలిస్తేనే విజయమని ఇన్‌ఛార్జి మంత్రి బొత్స సత్యనారాయణ ప్రవచనాలు చెప్పివచ్చారు. తాజాగా యాదవ సామాజిక తరగతికి టిక్కెట్ ఇవ్వాలన్న డిమాండ్ ముందుకొచ్చింది. అందుకోసం ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నారు. అవసరమైతే తిరుగుబాటుకు సిద్ధం కావాలని కొందరు నేతలు భావిస్తున్నట్లు తెలిసింది. ఈ సమావేశాల్లో టిడిపి నేతలు, జనసేన నేతలు భాగస్వామ్యమైనారు. రానున్న కాలంలో ఎలాంటి పరిస్థితులు నెలకొంటాయో చెప్పకనే చెప్తున్నారు. వైసిపిలో మూడు కాయలు, ఆరు పళ్లుగా వర్ధిల్లుతున్నాయి. పలాస నియోజకవర్గంలో అసమ్మతి రాగం జోరందుకుంది. మంత్రికి మళ్లీ టిక్కెట్ ఇస్తే ఓడిస్తామన్న స్థాయికి అసమ్మతి రాగం సప్తస్వరాలను వినిపిస్తోంది. విబేదాలతో పార్టీకి నష్టం తేవొద్దని జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ హితబోధ చేసివచ్చారు. టెక్కలి నియోజకవర్గంలోనూ అదే తంతు కొనసాగుతోంది. సిఎం నేరుగా దువ్వాడ శ్రీనివాస్‌ను అభ్యర్థిగా ప్రకటించి, నేతలకు హామీలు, భరోసా ఇచ్చినా అక్కడ అసమ్మతి బండి ఇంకా పట్టాలెక్కలేదని తాజా పరిణామం, నేతల అనుయాయుల మాటలనుబట్టి తెలుస్తోంది. అక్కడ తుపాను ముందు ప్రశాంత వాతావరణంగా కనిపిస్తోందని సీనియరు నేత ఒకరు చెప్పడం విశేషం. పాతపట్నం నియోజకవర్గంలో సమసిపోయే పరిస్థితి లేదు. ముఖ్యనేతల ప్రోత్సాహంతో వలస నేతల దాడి పెరుగుతోంది. నరసన్నపేటలో మరో విచిత్రమైన పరిస్థితి నెలకొంది. ప్రధానంగా సారవకోట, జలుమూరు మండలాల్లో ధర్మాన కృష్ణదాస్‌కు వ్యతిరేకంగా అసమ్మతి గ్రూపు తయారైనట్లు ప్రచారం ఉంది. పార్టీ, ప్రభుత్వ కార్యక్రమాలకు వారంతా కృష్ణదాస్‌కు సహాయ నిరాకరణ కార్యక్రమం చేపట్టినట్లు తెలిసింది. మరో విచిత్రం ఏమితంటే ఆ అసమ్మతి గ్రూపు ధర్మాన ప్రసాదరావుతో సత్సంబంధాలు కొనసాగించడం విశేషం. ఆమదాలవలస నియోజకవర్గంలోనూ ఆశావహుల రూపంలో మూడు శిబిరాలు నడుస్తున్నాయి. సర్వేలో ఒక ఆశావహుని పేరు ముందుకొచ్చినట్లు అత్యంత విశ్వసనీయవర్గాల ద్వారా తెలిసింది. ప్రధాన ఆశావహుని పేరు కింద స్థాయిలో ఉందని సర్వే నివేదిక వెల్లడైనట్లు సమాచారం. ఎచ్చెర్ల నియోజకవర్గంలోనూ గ్రూపుల పోరు బలంగా ఉంది. ముందస్తుగానే కొన్ని చర్యలు తీసుకున్నట్లు తెలిసింది. ఎమ్మెల్యే దగ్గరి కుటుంబసభ్యులను పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంచాలని అదినాయకత్వం స్పష్టం చేసినట్లు తెలిసింది. అంతేకాదు నియోజకవర్గంలో పెత్తందారీతనంతో దూకుడుగా వ్యవహరిస్తున్న ఓ ఎంపిపి అధ్యక్షులను కూడా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంచాలని పార్టీ నాయకత్వం స్పష్టం చేసినట్లు తెలిసింది.

జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో మళ్లీ అభ్యర్థులమవుతారనుకున్న వారికి ప్రజల్లో కొంత ప్రతికూలత ఉందని సర్వేలో తేలిందని విశ్వసనీయంగా తెలిసింది. అందువల్ల ప్రత్యామ్నాయ అభ్యర్థులు ఎవరన్నదాంతోనే ఆశావహులను, సీనియర్లు సూచించిన వారిని సర్వేలో చేర్చినట్లు తెలిసింది. అయితే ఇప్పటి సర్వే చివరిది కాదు. మరో రెండు, మూడు సర్వేలు జరగనున్నాయి. నిర్వహిస్తున్న పలు రకాల సర్వేలను క్రోడీకరించిన తరువాతే కొత్త అభ్యర్థులను తెరపైకి తెచ్చే అవకాశం ఉంది. పని, సామర్థ్యం లేకుండా ప్రజల్లో ఉండకుండా ఉన్న వారిని తప్పించి, కొత్త వారికి టిక్కెట్లు ఇస్తానని జగన్మోహన్‌రెడ్డి ఇప్పటికే ప్రకటించారు. కనుక గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నేతలు వదలిపెట్టలేకపోతున్నారని తెలిసింది. గ్రూపుల గోలతో సర్వేల జాతరతో అభ్యర్థుల ఎంపికలో మార్పులు, చేర్పులు చూడాల్సి ఉంటుంది.

-సత్తారు భాస్కరరావు



ఫెన్సింగ్ పోటీలో పాల్గొన్న క్రీడాకారులు

ఉత్సాహంగా ఫెన్సింగ్ పోటీలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఫెన్సింగ్ పోటీలను నగరంలోని టౌన్ హాల్లో శనివారం నిర్వహించారు. అండర్-14, అండర్-17, అండర్-20, సీనియర్ విభాగాల్లో బాల, బాలికల విభాగాలకు నిర్వహించిన ఈ పోటీలను జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి నొవాడ విజయకుమార్, జిఎస్ఎల్ జ్యువలర్స్ అధినేత బోయిన ప్రసన్న, ఫెన్సింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వైశ్యరాజు మోహన్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ జిల్లాకు చెందిన ఫెన్సింగ్ క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో రాణించి జిల్లాకు ఖ్యాతి తీసుకురావాలన్నారు. ఫెన్సింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వైశ్యరాజు మోహన్ మాట్లాడుతూ జిల్లాస్థాయి పోటీలను నిర్వహించడంపై క్రీడాకారుల్లో ప్రతిభను గుర్తించడానికి తోడ్పడుతుందన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశామన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 5,6 తేదీల్లో కాకినాడలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతగా ఎన్ఐఎస్ కోచ్ జోగిపాటి వంశీ వ్యవహరించారు. ఈ పోటీల్లో ఫెన్సింగ్ అసోసియేషన్ జిల్లా సహాయ కార్యదర్శి భవాని, పలివిరెడ్డి సంపతిరావునాయుడు, గురుగుబెల్లి ప్రసాదరావు, టంకాల కృష్ణ, న్యూట్రిషన్ కోచ్ నాగరాజు, కొత్తూరు గౌతమ్, కొత్తూరు నవీన్ పాల్గొన్నారు.

వైకల్యం శాపం కాదు

ప్రజాశక్తి- జిల్లా విలేకరుల యంత్రాంగం

అంగవైకల్యం మనో నిబ్బరానికి అడ్డంకి కారాదని, అన్ని రంగాల్లో రాణించి ప్రతిభ ఉన్న శిఖరాలు అధిరోహించాలని వికలాంగులశాఖ ఎడి ఎం కిరణ్‌కుమార్ అన్నారు. నగరంలోని ఆర్ట్స్ కళాశాల ఆవరణలో వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థలు, లయన్స్ క్లబ్ సెంట్రల్ సంయుక్తంగా అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ జిల్లాలో అర్హులైన వికలాంగులందరికీ ఆసరామైన రీతిలో తోడ్పాటు అందిస్తున్నామని అన్నారు. విద్యార్హతలు ఉన్న వికలాంగులకు ప్రభుత్వ, ప్రయివేటు రంగాల్లో ఉపాధి అవకాశాలు ఉన్నాయని, వాటిని దక్కించుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆసరుగురికి నగదు, వస్త్రాలను అందజేశారు. కార్యక్రమంలో స్టార్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు శాసపు జోగినాయుడు, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు కరణం హరికృష్ణప్రసాద్, వాకర్స్ ఇంటర్నేషనల్ గవర్నర్ పి.జి.గుప్తా, లయన్స్ క్లబ్ మాజీ చైర్మన్ డాక్టర్ చింతాడ కృష్ణమోహన్, వాకర్స్ మాజీ గవర్నర్లు జి.ఇందిరాప్రసాద్, గుడ్ల సత్యనారాయణ, ఇంటాక్ కో-కన్వీనర్ వావిలపల్లి జగన్నాథనాయుడు, డాక్టర్ మాదిన ప్రసాదరావు, విశ్రాంత ఎస్ఐ పి.రంగారావు పాల్గొన్నారు.

వికలాంగులకు న్యాయపరమైన సాయం అందించడానికి ఎల్లప్పుడు న్యాయ సేవాధికార సంస్థ తోడ్పాటు అందిస్తుందని సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు తెలిపారు. శ్రీకాకుళం నగరంలోని జెడ్‌పి సమావేశ మందిరంలో న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యాన వికలాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వికలాంగుల శాఖ ఎడి ఎం.కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

ఆమదాలవలస మండల పరిషత్ కార్యాలయంలోని మండల వనరుల కేంద్రంలో బోధనోపకరణాలు, ఆటల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను ఎంపిపి ప్రతినిధి



కొత్తూరు : మాట్లాడుతున్న తులసీవరప్రసాదరావు

తమ్మినేని శ్రీరామ్మూర్తి అందజేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ వాసుదేవరావు, ఎపిఎం పైడి కూర్మారావు, గేటు పాఠశాల ప్రధానోపాధ్యాయులు బోర కుమారస్వామి, సహిత ఉపాధ్యాయులు పూజారి శ్రీధర్, ఎస్.గోవిందరావు, సిఆర్‌పిలు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం ముత్యాలమ్మపేట భవిత కేంద్రంలో వికలాంగులకు ఎంఇఒ అప్పారావు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం త్రినాథరావు, ఎ.తేజేశ్వరరావు, సంతోషరాణి, ఉషారాణి, సూర్యం, అరుణ పాల్గొన్నారు.

సమాజంలో అంగవైకల్యం శాపం కాదని, అనేక శరీరక లోపాలని టెక్కలి ఎంఇఒ దాసరి నాగభూషణం అన్నారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని స్థానిక భవిత కేంద్రంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మానసిక లోపాలున్న అంగవైకల్యంగా భావించవచ్చునని అన్నారు. చిన్నారుల్లోని లోపాలను గుర్తించి వారికి ఆప్యాయత, అనురాగాలతో వాటి నుంచి దూరం చేయవచ్చునన్నారు. కార్యక్రమం సందర్భంగా కేంద్రంలో ఉన్న మానసిక అమగ వైకల్యం కలిగిన చిన్నారుల్లో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఫిజియోథెరపిస్ట్ వాసుకిరణ్, సహిత విద్యా టీచర్ ఆట్టాడ మన్మధరావు, మండల రిసోర్స్ కేంద్రం సిబ్బంది రవి, రవి, సంతోష్, రాంబాబు, సిఆర్‌పిలు పాల్గొన్నారు.

కాశీబుగ్గ భవిత కేంద్రంలో మానసిక వికలాంగులకు ఆర్ట్ పోటీలు నిర్వహించారు. ఇందులో గెలుపొందిన విజేతలకు ఎంపిడిఒ రమేష్‌నాయుడు అందజేశారు. కార్యక్రమంలో ఎంఇఒ సిహెచ్.శ్రీనివాసరావు, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ పి.బాలరాజు, సమీకృత విద్యావనరుల కేంద్రం ఉపాధ్యాయులు రవిశ్రీనివాస్ పాల్గొన్నారు.



శ్రీకాకుళం అర్బన్ : సన్మానిస్తున్న హరికృష్ణప్రసాద్

కొత్తూరు భవిత కేంద్రంలో వికలాంగులకు నిర్వహించిన ఆట పోటీల్లో గెలుపొందిన విజేతలకు నియోజకవర్గ నాయకులు లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఎంపిపి నవర సావిత్రి, ఎంపిపి ప్రతినిధి రమేష్, బి.శ్రీధర్, ఎపిఎం త్రినాథమ్మ, ఢిలీశ్వరరావు, గ్రేసీశాంతి, మండల ప్రత్యేక ఆహ్వానితులు అంపిలి ప్రసంతకుమార్, ప్రధానోపాధ్యాయులు లక్ష్మీనరసింహ, తిరుపతిరావు పాల్గొన్నారు.



కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న ఢిల్లీరావు

జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి- పలాస

క్రీడాకారులు గెలుపు ఓటములను సమానంగా చేసుకోవాలని బొడ్డపాడు జైభీమ్ యువజన సంఘం అధ్యక్షులు కిక్కెర ఢిల్లీరావు అన్నారు. మండలంలోని బొడ్డపాడులో జైభీమ్ యువజన సంఘం 29వ వార్షికోత్సవం సందర్భంగా శనివారం జిల్లాస్థాయి కబడ్డీ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏటా జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. గెలుపొందిన విజేతలకు బహుమతులు, నగదు అందజేస్తామని చెప్పారు. ఈ పోటీలకు జిల్లా నుంచి 26 టీమ్‌లు పాల్గొన్నారని తెలిపారు. క్రీడాకారులు తమ ప్రతిభ ప్రదర్శించే విధంగా ఉండాల తప్ప వ్యక్తిగత దూషణకు వెళ్లకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో దాసరి శ్రీరాములు, సారాకుమార్, జైభీమ్ యువజన సంఘం నాయకులు పాల్గొన్నారు.



అభినందిస్తున్న జోహర్‌ఖాన్

క్రీడాకారులకు అభినందనలు

ఇచ్ఛాపురం: ఈ నెల 5 నుంచి 8వ రాజమండ్రిలో నిర్వహించనున్న దక్షిణ భారత్ ఖోఖో టోర్నమెంట్ పోటీలకు స్థానిక జ్ఞాన భారతి విద్యాసంస్థలకు చెందిన 13 మంది విద్యార్థులు శనివారం వెళ్లనున్నారని విద్యాసంస్థల కార్యదర్శి జోహర్‌ఖాన్ తెలిపారు. ఈ మేరకు స్కూల్‌లో క్రీడాకారులకు అభినందించారు. ఖోఖో పోటీలు ప్రతిభకనబరిచాలని అన్నారు. కార్యక్రమంలో ట్రస్టీ రమణమూర్తి, ప్రిన్సిపాల్ ఐ.పండా, ఎఒ ప్రేమ్ సర్తాజ్‌ఖాన్, ప్రమోద్‌కుమార్, కైలాస పండా పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

మంత్రి అప్పలరాజు



మున్సిపాలిటీలో పర్యటిస్తున్న మంత్రి అప్పలరాజు

పలాస: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందిస్తున్నామని మత్స్య, పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. పలాస-కాశీబుగ్గ మున్సిపల్ పరిధి 13 వార్డులో శనివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యాక్రమాన్ని శనివారం నిర్వహించారు. ముందుగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరించి పోస్టర్లను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పుట్టిన పిల్లల నుంచి వృద్ధుల వరకూ పథకాల ప్రవేశపెట్టిన ఏకైక సిఎం జగన్ అని అన్నారు. పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తు న్నామని తెలిపారు. నాడు-నేడు పేరుతో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, ఆస్పత్రులను అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, పలాస ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ డబ్బీరు భవానీశంకర్, ఎఎంసి చైర్మన్ పి.వి.సతీష్, మున్సిపల్ మాజీ చైర్మన్ కోత పూర్ణ చంద్రరావు, వైస్ చైర్మన్ మీసాల సురేష్‌బాబు, బోర బుజ్జి, మున్సిపల్ విప్ దుర్గాశంకర్ పండా, పోతనపల్లి హరి, కమిషనర్ టి రాజగోపాల్, డిఇఇ బళ్ల హరి పాల్గొన్నారు.

'సిపిఎస్ ఇంటికి యుటిఎఫ్'

ప్రజాశక్తి- రణస్థలం

ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర శాఖ పిలుపుమేరకు సిపిఎస్ ఇంటికి యుటిఎఫ్ అనే వినూత్న కార్యక్రమాన్ని మండలంశాఖ శనివారం నిర్వహించింది. ఈ సందర్భంగా మండలంలో పనిచేస్తున్న పలు సిపిఎస్ ఉపాధ్యాయుల ఇళ్లను సందర్శించి వారి కుటుంబాలతో సిపిఎస్ వల్ల జరిగే పర్యవసానాలను ముచ్చటించారు. భవిష్యత్‌లో సిపిఎస్ రద్దు కోసం నిర్వహించే పోరాటాల్లో కుటుంబాలతో సైతం పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లాశాఖ ప్రధాన కార్యదర్శి ఎస్.కిషోర్ కుమార్, జిల్లా సహాధ్యక్షులు ధనలక్ష్మి, రాష్ట్ర పూర్వ కార్యదర్శి జి.గిరిధర్, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.కోదండరామయ్య, టి.శంశంకరరావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎస్.నారాయణరావు, జిల్లా కౌన్సిల్ సభ్యులు డి.కోటేశ్వరరావు, కోశాధికారి కుమారస్వామి, డి.రామారావు, నాగరాజు, సంతోష్, కామేష్, సీతారాం పాల్గొన్నారు.



కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న యుటిఎఫ్ నాయకులు



104 సంచార వైద్యశాలను పరిశీలిస్తున్న ముకుందరావు

104 వైద్య సేవలు భేష్

కవిటి: ఎంఎంయు 104 సంచార వైద్య విధానం ద్వారా మారుమూల గ్రామాల్లో అందిస్తున్న వైద్య సేవలు అభినందనీయమని డివిజనల్ ఆపరేటివ్ ఎగ్జిక్యూటివ్ కె.ముకుందరావు అన్నారు. ముఖ్యంగా గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తూ, అక్కడకూ రాలేని రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి కుటుంబ వైద్యుడు అందిస్తున్న సేవలతో గ్రామీణులకు ఎంతో మేలు కలుగుతుందని పేర్కొన్నారు. మండలంలోని ముత్యాలపేటలో ఎంఎంయు వాహనం ద్వారా అందిస్తున్న ఉచిత వైద్య శిబిరాన్ని శనివారం పరిశీలించారు. గ్రామస్తులతో మాట్లాడి స్థానిక సిబ్బంది అందిస్తున్న సేవలు గురించి తెలుసుకున్నారు. ముఖ్యంగా 104 ఎంఎంయు సంచార వైద్యశాల వైద్యుడు పూడి రామారావు అందిస్తున్న సేవలను ప్రశంసించారు. కార్యక్రమంలో డిఒ ఎం.సంతోష్, రాజేంద్రనాయక్ తదితరులు పాల్గొన్నారు.



అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న పురుషోత్తంనాయుడు

ఉచిత అంబులెన్స్ సేవలు ప్రారంభం

శ్రీకాకుళం అర్బన్ : డాడీ హెల్పింగ్ ఫౌండేషన్ ద్వారా ప్రభాస్ సూర్య అందిస్తున్న సేవా కార్యక్రమాలు స్ఫూర్తిదాయకమని ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ రాష్ట్ర సహాధ్యక్షులు చౌదరి పురుషోత్తంనాయుడు కొనియాడారు. నగరంలోని చైతన్య సహకార జూనియర్ కళాశాల ఆవరణలో డాడీ హెల్పింగ్ ఫౌండేషన్ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న ఉచిత అంబులెన్స్ సేవలను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డాడీ హెల్పింగ్ ఫౌండేషన్ ద్వారా ఉచిత అంబులెన్స్, ఫ్రీజర్ బాక్స్, పేదలకు రోజూ భోజనాలు అందించడం అభినందనీయమన్నారు. కరోనా విపత్కర పరిస్థితుల్లో అందించిన సేవలు వెలకట్టలేనివన్నారు. వైద్యులు పి.ఎల్.ఎన్.రాజు సహకారంతో ఉచిత అంబులెన్స్ సేవలను అందుబాటులోకి తీసుకురావడం ఆనందంగా ఉందన్నారు. గర్భిణులకు, వృద్ధులకు, పేదలకు అత్యవసర పరిస్థితుల్లో ఉచిత అంబులెన్స్ సేవలు ఎంతగానో ఉపాయుక్తంగా ఉంటాయన్నారు. చైతన్య కళాశాల ప్రతినిధులు రౌతు శ్రీనివాసరావు, కిరణ్, సంపత్, వి.టి.నాయుడు, నటుకుల మోహన్, జెసిఐ అధ్యక్షులు హరికృష్ణప్రసాద్, అప్పారావు, దయ పాల్గొన్నారు.

డ్రెయినేజీ పనుల పరిశీలన

నరసన్నపేట: నరసన్నపేట మేజర్ పంచాయతీ చేపడుతున్న అభివృద్ధి పనులను సర్పంచ్ బి.శంకర్ శనివారం పరిశీలించారు. రూ.27 లక్షలతో బజారువీధి, తిరుమలవీధిల్లో చేపడుతున్న డ్రెయినేజీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పనులు వేగవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిటిసి వైశ్యరాజు కేశవరావు, కో-ఆప్షన్ సభ్యులు రమణ సాహు, గనగల్ల వెంకట శ్రీనివాస్, సత్యనారాయణ పాల్గొన్నారు.

'బొత్స'ను కలిసిన సొండిలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సొండి తరగతులకు ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని నవ్యాంధ్ర సొండి కుల సంక్షేమ సేవా సంఘం ధ్యక్షులు నెమలపురి కోటేశ్వరచౌదరి కోరారు. నగరంలో వైసిపి కార్యాలయంలో ఇన్‌ఛార్జి మంత్రి బొత్స సత్యనారాయణను శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. 12 మంది డైరెక్టర్లలో ఒక్క డైరెక్టర్ పదవిని మాత్రమే ఇచ్చారని బొత్సకు వివరించారు. అందువల్ల సొండిలకు ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటు చేసి తగిన విధంగా ఆదుకోవాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో మొగలిపురి కిషోర్‌కుమార్, రత్నాల మురళీమోహన్ ఉన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న కోటేశ్వరరావు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం



బృందావన్ చౌదరి మృతదేహం

మండలంలోని ఎ.ఎస్.పేట వద్ద శనివా రం సంభవించిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు... అదే గ్రామానికి చెందిన రత్నాల బృందావన్ చౌదరి (63) సైకిల్‌పై లారీ సప్లయి కార్యాలయంలో పనిచేసేందుకు వెళ్తున్నారు. క్రేన్ ఆపరేటర్ వెనుక నుంచి సైకిల్‌కు బలంగా ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో చౌదరి టైర్‌కు సైకిల్‌తో సహ వెళ్లిపోవడంతో ఆయనపై నుంచి వెళ్లిపోయింది. దీంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానికులు 108లో స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించగా... అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతుడు కుమారుడు కార్తిక చౌదరి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ గోవిందరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.



మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్న పోలీసులు

అక్రమ మద్యం పట్టివేత

రణస్థలం: జె.ఆర్.పురం పోలీస్ స్టేషన్ పరిధిలోని దన్నానపేట సమీపంలో 16వ నంబరు జాతీయ రహదారిపై అక్రమంగా తరలిస్తున్న మద్యం బాటిళ్లను పట్టుకున్నామని ఎస్ఐ జి.రాజేష్ తెలిపారు. వాహనంలో 4,650 మద్య బాటిళ్లను ఆమదాలవలస మండలం కుద్దిరాంకు చెందిన కొర్ని రాజు, శింగంశెట్టి గిరిబాబు, ఒడిశా రాష్ట్రానికి చెందిన నక్క రామారావులు టాటా ఎసిలో అక్రమంగా మద్యం బాటిళ్లను తరలిస్తున్నారని పేర్కొన్నారు. తన సిబ్బందితో వాహనాలను తనిఖీ చేస్తుండగా... పట్టుబడినట్లు చెప్పారు. మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని, వాహనాన్ని సీజ్ చేశామని అన్నారు. ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేశామని తెలిపారు.



వినతిపత్రం అందజేస్తున్న కిరణ్‌కుమార్

దాడికి పాల్పడిన వారిని అరెస్టు చేయాలి

ప్రజాశక్తి- టెక్కలి/రూరల్ : ఇటీవల టెక్కలి జనసేన పార్టీ కార్యాలయంపై దాడి చేసిన వ్యక్తిలను వెంటనే అరెస్టు చేయాలని నియోజకవర్గ ఇన్‌ఛార్జి కణితి కిరణ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సిఐ చంద్రమౌళిని శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ముందుగా స్థానిక అంబద్కర్ పార్కులో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. నిందితులను తక్షణమే అరెస్టు చేయాలని కోరుతూ నల్ల దుస్తులు ధరించి నోటికి నల్లగుడ్డలు కట్టుకొని టెక్కలి పాత బస్టాండ్‌లోని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు. అనంతరం పోలీస్ స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలీసులు పక్షపాత వైఖరి అవలంబిస్తుండడం సరికాదన్నారు.

ఎస్.కొలిగాంలో వైద్య శిబిరం

మెళియాపుట్టి : మండలంలోని సవరకొలిగాంలో రాగోలు జెమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యాన శనివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ మేరకు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రాధమ్మ, అడ్డియాడు, భరణికోట సర్పంచ్ ప్రతినిధి ఎస్.రంగారావు, ఎంపిటిసి రవికుమార్ పాల్గొన్నారు.

మాజీ మంత్రి పరామర్శ

పలాస : పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని తాళభద్రకు చెందిన దట్టి లక్ష్మీనారాయణ ఇటీవల మృతి చెందింది. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి గౌతు శ్యాంసుందర్ శివాజీ, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష మృతుడి కుటుంబ సభ్యులను శనివారం పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, బిసిసెల్ రాష్ట్ర కార్యదర్శి లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, టిడిపి పట్టణ అధ్యక్షుడు బి.నాగరాజు, టిడిపి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



పరామర్శిస్తున్న శివాజీ, శిరీష

బాధితులకు 'ఎంజిఆర్' ఆర్థికసాయం




ఆర్థికసాయం అందజేస్తున్న గోవిందరావు

హిరమండలం: హిరమండలంలో ఇటీవల సంభవించిన అగ్నిప్రమాదంలో అంధవరపు రమణమూర్తి, కడలి ఎండుకొండలు, కళింగపట్నం ధనుంజయ, గవర రామారావు, కూన దుర్యోధనలకు చెందిన బట్టలు, కూరగాయల షాపులు దగ్ధమయ్యాయి. విషయం తెలుసుకున్న బాధితులను సామాజిక వేత్త, టిడిపి నాయకులు మామిడి గోవిందరావు శనివారం పరామర్శించి ఐదు కుటుంబాలకు రూ.17 వేలు ఆర్థికసాయం అందజేసి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. బాధితులతో మాట్లాడుతూ మీకు అన్ని రకాలుగా ఆదుకుంటానని హామీఇచ్చారు. కార్యక్రమంలో ఎంజిఆర్ యువసేన అధ్యక్షులు పోతురాజు శ్రీధర్, ధనుపురం మాజీ సర్పంచ్ మామిడి గంగాధర్, గొట్ట మాజీ సర్పంచ్ చాపల రామారావు, అంపిలి పోలినాయుడు, పోతురాజు బాలకృష్ణ, పైల శాంతారావు, సాసుపల్లి దాలిరాజు, కలిశెట్టి వేణుగోపాలరావు, రెల్ల దాము, కర్ణం శ్రీను, దొడ్ల రామారావు, రాడ అప్పారావు, మటుపతి సంతోష్, కుంచాల బాలకృష్ణ, మక్కా రమణ పాల్గొన్నారు.

గ్రావెల్‌తో బెర్మ్‌లను నిర్మించాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

ఆమదాలవలస నుంచి పురుషోత్తపురానికి వెళ్లే ప్రధాన నూతన రహదారి నిర్మాణంలో భాగంగా రోడ్డుకు ఇరువైపులా గ్రావెల్‌తో బెర్మ్‌లను కాంట్రాక్టర్‌ను నిర్మించాలని, పెద్దపెద్ద బండరాళ్లతో కూడిన మట్టిని వేస్తుండడంతో సరికాదని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేడాడ రామ్మోనరావు అన్నారు. ఈ మేరకు రహదారిపై శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పనులను వెంటనే నిలుపుదల చేయాలని, గ్రావెల్‌తో మాత్రమే పనిని చేపట్టాలని అన్నారు. లేనిపక్షంలో జనసేన పార్టీ తరఫున పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం అక్కడ నుండే సంబంధిత అధికారులకు ఫోన్ చేసి చేపడుతున్న పనులను వారి దృష్టికి తీసుకువెళ్లారు. ఈయనతో పాటు జనసైనికులు ఉన్నారు.



పనులను పరిశీలిస్తున్న రామ్మోహనరావు



రాజేష్‌ను సన్మానిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

రాజేష్‌కు కలెక్టర్ సన్మానం

పొందూరు: మండలంలోని తాడివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న బధిర విద్యార్థి టి.రాజేష్‌ను జెడ్‌పి సమావేశ మందిరంలో కలెక్టర్ శ్రీకేశ్ లాఠకర్ శనివారం సన్మానించారు. అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా జాతీయస్థాయిలో జుడో పోటీలో పాల్గొని జిల్లాకు పేరుప్రఖ్యాతులు తీసుకువచ్చిన రాజేష్‌కు దుశ్శాలువ కప్పి సన్మానించారు. అలాగే రాజేష్‌కు శిక్షణ ఇచ్చి ప్రోత్సహించిన వ్యాయామ ఉపాధ్యాయులు పైడి సునీతను అభినందించారు. దీంతో ప్రధానోపాధ్యాయులు లఖినాన హేమనాచార్యులు, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.



పోస్టర్‌ను ఆవిష్కరించిన షణ్ముఖరావు

పోస్టర్ ఆవిష్కరణ

టెక్కలి : ఈ నెల 16 నుంచి 20 వరకు కేరళ రాష్ట్రం ఆల్‌పూజలో నిర్వహించనున్న ఎఐటియుసి జాతీయ మహసభలు నిర్వహిస్తున్నారని, దీనిని విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి అనపాన షణ్ముఖరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు టెక్కలిలో పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హమాలీ కార్మికులకు పనిభద్రత కల్పించాలన్నారు. ఇఎస్ఐ, పిఎఫ్ వంటి అమలు చేయాలన్నారు. సాధారణంగా మృతి చెందిన కార్మిక కుటుంబాలకు రూ.5 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు. ప్రమాదంలో మృతి చెందిన రూ.పది లక్షలు అందజేయాలని డిమాండ్ చేశారు. ఈయనతో పాటు జిల్లా నాయకులు చిక్కాల గోవిందరావు, భవననిర్మాణ కార్మిక సంఘం నాయకులు పాల పోలారావు, హమాలీ సంఘ నాయకులు టి.సింహాచలం, రామారావు, ప్రభుదేవ్, బెహరా పాల్గొన్నారు.

దోచుకోవడం, దాచుకోవడమే జగన్ లక్ష్యం

ఎంపీ రామ్మోహన్‌నాయుడు

ప్రజాశక్తి- పొందూరు

భూటకపు హామీలతో మోసపూరితమైన మాయమాటలు చెప్పి అధికారం చేపట్టిన సిఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ లక్ష్యం దోచుకోవడం, దాచుకోవడమేనని ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు, టిడిపి జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్‌లు విమర్శించారు. మండలంలోని తాడివలసలో సర్పంచ్ తమ్మినైన మణెమ్మ, టిడిపి మండల అధ్యక్షుడు చిగిలిపల్లి రామ్మోహనరావు అధ్యక్షతన శనివారం 'ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి రాష్ట్రంలో జరుగుతున్న ఆరాచకాలతో, దౌర్జాన్యాలతో, పెరిగిన ధరలు, నిరుద్యోగం సమస్య, అడుగంటిన అభివృద్ధి ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడుతూ ఒక్క అవకాశమంటూ అధికారంలోకి వచ్చిన జగన్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కటీ నెరవేర్చలేదని అన్నారు. అధికారం చేపట్టిన నుంచి ఎలా దోచుకోవాలి, ఎలా దాచుకోవాలనేది చూస్తున్నారని అన్నారు. అమ్మఒడి పథకం పెట్టి కుటుంబంలో అందరి పిల్లలకు రూ.15వేలు ఇస్తామని చెప్పి తరువాత ఒక్కరికే అమలు చేయడంతో పాటు ఏటా కోతలు పెట్టుకుపోతున్నదని పేర్కొన్నారు. ట్రాక్టర్ ఇసుకను రూ.6వేలు చేసి ఇసుక బకాసురుడులా శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అమ్ముకుంటున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు సీపాన శ్రీరంగనాయకులు, చింతాడ కృష్ణవాసుదేవరావు, అన్నెపు రాము, బలగ శంకరభాస్కరరావు, బాడాన గిరి, కె.అప్పలనాయుడు, అనకాపల్లి శ్రీరంగ, వండాన మురళి, సీపాన భాస్కరరావు, టి.లక్ష్మణరావు, ఫాల్గుణరావు, రాంప్రసాద్, సత్యం, మధు, శ్రీనివాసరావు, వెంకట్ పాల్గొన్నారు.

ఆమదాలవలస/సరుబుజ్జిలి : నిలకడ లేని పాలనతో రాష్ట్ర ప్రజలకు ఇదేమి ఖర్మ అని టిడిపి జిల్లా పార్లమెంటరీ పార్టీ అధ్యక్షులు కూన రవికుమార్ అన్నారు. సరుబుజ్జిలి మండలంలోని తెలికిపెంట పంచాయతీ పరిధిలోని ఎల్పిఎం అగ్రహారం, పర్వతాలపేట, తెలికిపెంట గ్రామాల్లో ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి వైసిపి పాలనలో ప్రజలు పడుతున్న కష్టాలను మహిళలను అడిగి తెలుసుకున్నారు. సర్పంచ్‌లు నందివాడ రాజ్యలక్ష్మి, పల్లి సురేష్, టిడిపి నాయకులు నందివాడ గోవిందరావు, శివ్వాల సూర్యం, అంబళ్ల రాంబాబు, సంజయ్, ఎండ రామారావు, ఐటిడిపి కో-ఆర్డినేటర్ నూక ప్రభాకర్, బోర గోవిందరావు, కింజరాపు సురేష్ పాల్గొన్నారు.



పలాస : పోస్టర్‌ను ఆవిష్కరించిన గౌతు శిరీష



శ్రీకాకుళం అర్బన్ : మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే లక్ష్మీదేవి

శ్రీకాకుళం అర్బన్ : రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండాపోయిందని మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి ధ్వజమెత్తారు. నగరంలోని దమ్మలవీధిలో టిడిపి ఆధ్వర్యాన ఇదేం కర్మ మన రాష్ట్రానికి పేరిట నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కేశవ రాంబాబు, నగర అధ్యక్షుడు మాదరపు వెంకటేష్, సింతు సుధాకర్, జామి భీమశంకరరావు, కరగాన రాము, సురకాశి వెంకటరావు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

పలాస : రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమం పేరుతో ప్రభుత్వ ఆస్తులను తాకట్టు పెట్టి ప్రజలకు ఇస్తున్నారే తప్ప రాష్ట్రాన్ని ఏమి అభివృద్ధి చేశారో చెప్పాలని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష ప్రశ్నించారు. స్థానిక టిడిపి కార్యాలయంలో రాష్ట్రానికి ఇదేమి ఖర్మ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో దువ్వాడ సంతోష్‌కుమార్, బి.నాగరాజు, అనిల్‌శర్మ, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


స్థలాన్ని పరిశీలిస్తున్న చైర్మన్ గిరిబాబు

ఇంటింటికీ తాగునీరు

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఇంటింటికీ తాగునీరు సరఫరా చేసేందుకు ఎఐబి పథకం ద్వారా రూ.96 కోట్ల వ్యయంతో పనులు చేపట్టేందుకు చర్యలు చేపడుతున్నామని చైర్మన్ బల్ల గిరిబాబు అన్నారు. కాశీబుగ్గ సంత మైదానంలో ఎఐబి పథకం శిలాఫలకం ఏర్పాటు, జాతీయ నాయకులు సర్దార్ వల్లభాయ్ పటేల్, బాబుజగ్గజీవన్, స్వాతంత్ర్య సమరయోధులు మార్పు పద్మనాభం, ఆంధ్ర రాష్ట్ర పితామహుడు పొట్టి శ్రీరాములు విగ్రహాలు ఏర్పాటుకు, తాగునీటి శిలాఫకం ఏర్పాటుకు శనివారం స్థలాన్ని పరిశీలించారు. ఆయనతో పాటు మున్సిపల్ వైస్ చైర్మన్ మీసాల సురేష్‌బాబు, బోర బుజ్జి, పలాస ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ డబ్బీరు భవానీశంకర్, మున్సిపల్ కమిషనర్ టి.రాజగోపాల్, స్థానిక వార్డ్ కౌన్సిలర్ బెల్లాల శ్రీను, 8వ కౌన్సిలర్ పిచ్చుక అజయ్‌కుమార్, మాజీ కౌన్సిలర్ బదకల బాలమ్మ, పులిరాజు పాల్గొన్నారు.

డిసిఇబినే పరీక్షలు నిర్వహించాలి

పొందూరు: ఒకటి నుంచి పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న అన్ని పరీక్షలను డిస్ట్రిక్ట్ కామన్ ఎగ్జామినేషన్ బోర్డు (డిసిఇబి) ద్వారానే నిర్వహించాలని డిటిఎఫ్ జిల్లా కార్యదర్శి పూజారి హరిప్రసన్న ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న పరీక్షల విధానం వల్ల అంతా గందరగోళంగా ఉందన్నారు. ఒకసారి పరీక్షలకు సంబంధించి అధికారులు ప్రశ్నపత్రాలు పంపిస్తున్నారు. మరొకసారి ఉపాధ్యాయులనే బోర్డుపై రాయడంటున్నారు. కొందరికి క్లాస్ రూమ్ బేస్డు ఎస్సెస్ మెంట్ అని మరికొందరికి ఫార్మేటివ్ పరీక్షలు అని లేనిపోని విధానాలు అమలు చేస్తున్న పరిస్థితుల్లో ఇటు విద్యార్థులు అటు ఉపాధ్యాయులు అయోమయంలో పడుతున్నారు. కనీసం ఒక ఏడాది పాటు ఒక నిర్దిష్టమైన ప్రణాళిక లేకుండా పరీక్షలకొక విధానాన్ని అమలు చేయడం సరికాదన్నారు.


శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ రామ్మోహన్‌నాయుడు

50 మంది రక్తదానం

శ్రీకాకుళం అర్బన్ : జిల్లాలో రక్తనిల్వలు తగ్గడంతో తలసేమియా, చికెన్‌సెల్స్ వంటి రోగులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, అందువల్ల స్వచ్ఛంద సంస్థలు, యువత రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని పార్లమెంటు సభ్యులు కింజరాపు రామ్మోహన్ నాయుడు పిలుపునిచ్చారు. నగరంలో శ్రీకాకుళం న్యూ బ్లడ్ బ్యాంకులో జిల్ ఫౌండేషన్ ఆధ్వర్యాన తలసీమియా రోగులకు నిర్వహించిన ప్రత్యేక రక్తదాన శిబిరాన్ని శనివారం ప్రారంభించారు. ఈ మేరకు 50 మంది దాతలు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో రక్తం అవసరం రోజురోజుకూ పెరుగుతోందని, అందువల్ల దాతలు ముందుకొచ్చి బాధితులను ఆదుకోవాలని అన్నారు. స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకొచ్చిన జిల్ పౌండేషన్ ప్రతినిధులను అభినందిచారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి, బ్లడ్ బ్యాంకు మేనేజర్ మణికంఠ, జిల్ ఫౌండేషన్ సభ్యులు సాయి, సత్యసాయి శివప్రసాద్, వెంకట రమణ, పవన్, చేయూత ఫౌండేషన్ వెంకటలక్ష్మి, మణిశర్మ పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

ప్రజాశక్తి- కవిటి

నిర్ణీత సమయానికి జగనన్న ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని తహశీల్దార్ అప్పలరాజు, ఎంపిడిఒ సూర్యనారాయణ లబ్ధిదారులకు సూచించారు. మండలంలోని వరకలో నిర్మిస్తున్న జగనన్న ఇళ్ల నిర్మాణాలను అధికారులతో కలిసి శనివారం పరిశీలించారు. అనంతరం ఇళ్ల లబ్ధిదారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షలు కేటాయించి, ఇసుక ఉచితంగా అందిస్తుందని తెలిపారు. సిమెంటు, ఐరన్ మార్కెట్ ధరలు కంటే తక్కువ ధరకే జగనన్న గృహ నిర్మాణాలకు అందిస్తున్నట్లు చెప్పారు. జగనన్న కాలనీల్లో డ్రెయినేజీ వ్యవస్థతో పాటు విశాలమైన రోడ్లు, విద్యుత్ సదుపాయం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 21న జగనన్న గృహ ప్రవేశాలు నిర్వహిస్తున్నారని, లబ్ధిదారులు ఈలోగా ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని కోరారు. శ్లాబ్ దశలో ఉన్న, గోడలతో నిలిచిపోయిన నిర్మాణాలు శరవేగంగా పూర్తయ్యేలా చూడాలని సర్పంచ్ ప్రతినిధి శ్రీకాంత్ పురియాకు సూచించారు. హౌసింగ్ ఎఇ సాయికిరణ్, విద్యుత్‌శాఖ ఎఇ నేతాజీ, విఆర్ఒ బి.శ్రీనివాస్ పాల్గొన్నారు.


కవిటి : మాట్లాడుతున్న తహశీల్దార్ అప్పలరాజు


ఇచ్ఛాపురం : లబ్ధిదారులతో మాట్లాడుతున్న మల్లేశ్వరరావు

ఇళ్ల నిర్మాణాలపై అవగాహన

ఇచ్ఛాపురం : ప్రభుత్వ ఆదేశాలు ప్రకారం జగనన్న కాలనీలో ఇళ్ళ నిర్మాణాల ఇంకా చేపట్టకపోతే పట్టాలు వెనక్కి తీసుకునే అవకాశం ఉందని సోషల్ డెవలప్‌మెంట్ స్పెషలిస్టు అర్బన్ హౌసింగ్ అధికారి సి హెచ్.మల్లేశ్వరరావు లబ్ధిదారులకు సూచించారు. హౌసింగ్ డే సందర్భంగా స్థానిక పీర్లకొండ లేఅవుట్ వద్ద లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. ఇళ్ల నిర్మాణంలో ఇంకా ఎవరికైనా ఆర్థిక సమస్యలు ఉంటే సమీపంలో ఉండే సచివాలయంలో పేర్లు నమోదు చేసువాలన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ డిఇ రామకృష్ణ, ఎఇ ప్రసాద్, మెప్మా అధికారి జానకి రామారావు పాల్గొన్నారు.

అలాగే జగనన్న కాలనీలో లబ్ధిదారులకు ఇచ్చిన ఇళ్ల నిర్మాణాల్లో అలసత్వం వహించవద్దని తహశీల్దార్ లావణ్య సూచించారు. మున్సిపాలిటీలో చేపడుతున్న జగనన్న ఇళ్ల నిర్మాణాలపై సమీక్షించారు. కార్యక్రమంలో హౌసింగ్ డిఇ రామకృష్ణ, మల్లేశ్వరరావు, రెవెన్యూ అధికారి శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆర్‌డిఒ సీతారామ్మూర్తి

ఓటరు నమోదుపై అవగాహన

ప్రజాశక్తి- కవిటి

వచ్చే ఏడాది జనవరి 1 నాటికి 18 ఏళ్ల నిండిన యువతీ యువకులకు ఓటు నమోదు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని పలాస ఆర్‌డిఒ సీతారామ్మూర్తి అన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఓటు నమోదుపై బిఎల్‌ఒలకు శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫారం-6 ఏవిధంగా ఉపయోగించుకోవాలి, ఓటరు నమోదులో మార్పులు, చేర్పులు, సవరణలు ఏవిధంగా చేయాలి అనే అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఆర్.అప్పలరాజు, ఎంపిడిఒ పైలా సూర్యనారాయణరెడ్డి, డిటి టి.రామచంద్రరావు, ఆర్ఐ కె.రమణమూర్తి పాల్గొన్నారు.

సంతబొమ్మాళి: 18 ఏళ్లు నిండిన వారందరూ ఓటర్లుగా నమోదు చేయాలని సంతబొమ్మాళి తహశీల్దార్ జె.చలమయ్య అన్నారు. తహశీల్దార్ కార్యాలయంలో బిఎల్ఒలతో సమావేశం నిర్వహించారు. రోజూ ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ పోలింగ్ కేంద్రాల్లో ఉండాలన్నారు. కార్యక్రమంలో డిటి వి.ప్రవీణ్‌కుమార్, ఆర్ఐ చంద్రమౌళి పాల్గొన్నారు.

రేపు 'ఉపాధి' పనులపై సమావేశం

పోలాకి: ఈ నెల 5న మండల పరిషత్ కార్యాలయంలో. ఉదయం 10 గంటలకు 2023-24 ఆర్థిక సంవత్సరంలో నిర్వహించాల్సిన ఉపాధి హామీ పనుల ప్రణాళికలపై సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ ఎం.ఈశ్వరరావు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కలెక్టర్, డ్వామా పీడీ ఆదేశాలు మేరకు ఈ సమావేశం నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశం జెడ్‌పిటిసి ధర్మాన కృష్ణ చైతన్య, ఎంపిపి ప్రతినిధి ముద్దాడ భైరాగినాయుడు ఆధ్వర్యాన నిర్వహిస్తామని చెప్పారు. సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, ఉపాధి హామీ పాల్గొవాలని సూచించారు.

అన్నింటా బాదుడే

రణస్థలం: పెంచిన విద్యుత్ ఛార్జీలను, ఆర్‌టిసి బస్సులు, గ్యాస్, డీజిల్, పెట్రోల్, నిత్యావసర సరుకులు ధరలు తక్షణమే చెల్లించాలని మాజీ మంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కిమిడి కళావెంకటరావు డిమాండ్ చేశారు. మండలంలోని మరంవాడ, ఎన్.జి.ఆర్.పురం గ్రామాల్లో శనివారం బాదుడే బాదుడు కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా ర్యాలీ నిర్వహించి అన్నింటా బాదుడే బాదుడు అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ విధానాలతో ప్రజలు విసుగుచెందుతున్నారని అన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



'జనం కోసం జనసేన'

ప్రజాశక్తి- ఆమదాలవలస

జనం కోసం జనసేన పనిచేస్తుందని జనసేన నాయకులు కోరుకొండ మల్లేశ్వరరావు, కొత్తకోట నాగేంద్ర, ఎంపిటిసి అంపిలి విక్రమ్‌లు అన్నారు. మండలంలోని శ్రీనివాసచార్యులపేట పంచాయతీ పరిధిలోని మండాదిలో శనివారం జనంతో జనసేన కార్యక్రమం నిర్వహించారు. ఈ మేరకు ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తాతతండ్రుల కాలం నాటి నుంచి నేర్చుకున్న వృత్తిని చేపడుతున్నప్పటికీ జీవనాన్ని సాగించే ఆదాయం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీరిని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జన సైనికులు సంతోష్ నాయుడు, పృథ్వీ, కిరణ్, జయరామ్, వీరు, మహేష్, రుద్ర, ప్రదీప్, అనిల్, వినోద్, సాయి, మోహన్ పాల్గొన్నారు.


మెళియాపుట్టి : సమస్యలను తెలుసుకుంటున్న చైతన్య

మెళియాపుట్టి : జనసేన పార్టీ జనవాణి-జన చైతన్యం కార్యక్రమంలో భాగంగా మండలంలోని జోడూరు, అచ్చానాపురం గ్రామాల్లో నియోజకవర్గ ఇన్‌ఛార్జి గేదెల చైతన్య ఇంటింటికీ సమస్యలను తెలుసుకున్నారు. జనసేన పార్టీకి ఒక అవకాశం ఇస్తే అభివృద్ధి చేసి చూపిస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో దుక్క బాలరాజు, వాకాడ గణేష్, బెజ్జిపల్లి తేజేశ్వరరావు, రామ్మూర్తి, పిట్ట హరి, రాజాన మోహన్, శ్రీను, రాజేష్ పాల్గొన్నారు.


షీల్డ్‌ను అందజేస్తున్న కమిషనర్ ఓబులేసు

బిజినెస్ అవార్డుల ప్రదానం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జూనియర్ ఛాంబర్స్, గ్రీన్ సిటీ యువ వ్యాపార వేత్తలను ప్రోత్సహించేందుకు అందిస్తున్న సహకారం ప్రశంసనీయమని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు అన్నారు. నగరంలోని నాగావళి హోటల్‌లో సేనేటర్ మధుబాబు అధ్యక్షతన వ్యాపార వేత్తలకు అవార్డును శనివారం ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యాపార మెలుకువలు నేర్పడం ద్వారా యువత కొత్త బిజినెస్ ట్రెండ్‌ను అలవర్చుకోవచ్చన్నారు. కార్యక్రమంలో నటుకుల మోహన్, బిర్లంగి ఉమామహేశ్వరరావు, లక్ష్మణ్, శాంతి, సత్యనారాయణ, ప్రావిజనల్ జోన్ ట్రైనర్ రిషిత, మనోహర్, మాధవి, శేషాద్రి, డాక్టర్ జాన్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మేనేజర్ శ్రీనివాస్

పెద్దశ్రీరాంపురానికి బస్సు సౌకర్యం

ప్రజాశక్తి- కంచిలి

మండలంలోని పెద్దశ్రీరాంపురం పంచాయతీ పరిధిలో ఈ నెల 9 నుంచి ఆర్‌టిసి బస్సు సౌకర్యం కల్పిస్తున్నామని సర్పంచ్ బల్లెడ సుమన్ తెలిపారు. ఈ మేరకు గ్రామంలో పలాస ఆర్‌టిసి డిపో మేనేజర్ బి.శ్రీనివాసరావు ఆధ్వర్యాన శనివారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కిడ్నీ సమస్యలతో బాధపడుతున్న వారికి, విద్యార్థులకు, అత్యవసరంగా నగరానికి వెళ్తున్న అనుకూలంగా బస్సు సౌకర్యం కల్పిస్తున్నామని అన్నారు. దీనిపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ సంతోష్‌కుమార్, సేఫ్టీ డ్రైవింగ్ ఇన్‌స్పెక్టర్ ఎన్.వి.రావు, గ్రామ పెద్దలు టి.తిరుపతిరావు, మాదిన క్రాంతికుమార్, ఆర్.ఎండయ్య, ఎం.మోహనరావు, ఎల్.సుందర్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపిపి దేవదాస్‌రెడ్డి

'ఉపాధి' పనులపై శిక్షణ

ప్రజాశక్తి- కంచిలి

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఉపాధి సిబ్బందికి 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి పైల దేవదాసురెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో కూలీలందరికీ ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎంపిడిఒ శ్రీనివాసరెడ్డి పనుల గుర్తింపు, నిర్వహణ, బిల్లుల చెల్లింపు వంటి అంశాలపై సూచనలు అందజేశారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి ఇప్పిలి లోలాక్షి, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.




కోళ్లను పంపిణీ చేస్తున్న ఎంపిపి ప్రవీణ

పెరటి కోళ్ల పెంపకంతో ఆదాయం

పలాస: పెరటి కోళ్ల పెంపకంతో ఆదాయం వస్తుందని ఎంపిపి ఉంగ ప్రవీణ అన్నారు. కాశీబుగ్గ స్త్రీ నిధి భవనంలో ఐకెపి ఆధ్వర్యాన 47 యూనిట్లు పెరటి కోళ్లను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యూనిట్‌కు 8 పెట్టలు, 3 పుంజులు ఉంటాయని, యూనిట్ రూ.3950లు ఉంటుందన్నారు. యూనిట్‌కు 11 కోళ్లతో పాటు 30 కేజీల ఆహారం, మందులు ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఎస్.రమేష్ నాయుడు, వైసిపి నాయకులు ఉంగ సాయికృష్ణ, మచ్చ ధనరాజ్, వెలుగు ఎపిఎం మల్లేశ్వరరావు, సిసి రమణ, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవరు విక్రయిస్తే చర్యలు

పలాస: దుకాణదారులు ప్లాస్టిక్ కవర్లను వినియోగిస్తే చర్యలు తీసుకుంటామని కమిషనర్ టి.రాజగోపాల్ హెచ్చరించారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ దుకాణాల్లో శనివారం దాడులు నిర్వహించారు. ఈ మేరకు ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తున్న దుకాణదారుల యజమానులకు రూ.5,100 అపరాధ రుసుం విధించారు. మరలా ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


చెక్కును అందజేస్తున్న జెడ్‌పిటిసి కృష్ణచైతన్య

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

పోలాకి: మండలంలోని బార్జిపాడుకు చెందిన పూడి అనిల్‌కుమార్‌కు సిఎం రిలీఫ్ ఫండ్ రూ.1.30 లక్షల చెక్కును జెడ్‌పిటిసి ధర్మాన కృష్ణచైతన్య శనివారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అనిల్‌కుమార్ అనారోగ్యానికి గురికావడంతో సిఎం రిలీఫ్ ఫండకు దరఖాస్తు చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి ముద్దాడ భైరాగి నాయుడు, వైస్ ఎంపిపి కలగదండు తాతారావు, చింతాడ ఉమా, సర్పంచ్ సనపల సోమేశ్వరరావు పాల్గొన్నారు.

బాధితురాలికి ఆర్థికసాయం

ఇచ్ఛాపురం : మండలంలో ఇన్నీసుపేటకు చెందిన ఇసురు లక్ష్మమ్మ అనారోగ్యంతో బాధపడుతుంది. విషయం తెలుసుకున్న పవన్ సేవా సంస్థ ప్రతినిధులు బాధితురాలికి రూ.5 వేలు ఆర్థికసాయం శనివారం అందించారు. జనసేన రాష్ట్ర జాయింట్ సెక్రటరీ తిప్పన దుర్యోధనరెడ్డి, వీర మహిళ ఆధ్వర్యాన బాధితురాలికి చికిత్స కోసం ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో పవన్ సేవా సంస్థ ప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బాబూ రాజేంద్రప్రసాద్‌కు నివాళి


చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న శ్రీనివాసరావు

లావేరు : లావేరు శాఖాగ్రంథాలయంలో స్వాతంత్ర సమరయోధుడు, తొలి రాష్ట్రపతి బాబూ రాజేంద్రప్రసాద్ జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వాతంత్ర భారతదేశానికి తొలి రాష్ట్రపతిగా అత్యున్నత పదవి చేపట్టి పదేళ్లపాటు భారత తొలి పౌరుడిగా మహోన్నత సేవలందించారన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీలో బి.రాజేష్‌కి ప్రథమ బహుమతి అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు ఎ.గడ్డియ్య, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే మురపాక శాఖా గ్రంథాలయంలోనూ బాబూరాజేంద్రప్రసాద్ చిత్రపటానికి గ్రంథాలయాధికారి ఎం.శ్రీనివాసరావు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు జి.షణ్ముఖరావు పాల్గొన్నారు.

ధర్మపురం ఫీల్డ్ అసిస్టెంట్‌పై విచారణ

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని ధర్మపురం ఎన్ఆర్‌జీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ పి.వెంకటరమణపై శనివారం ఎచ్చెర్ల క్లస్టర్ ఎపిడి ఎం.శైలజ విచారణ చేపట్టారు. గ్రామంలో 2016లో కూలీల కోసం ప్రభుత్వం సరఫరా చేసిన గునపాలు, టెంట్లను పంపిణీ చేయాలేదని, అలాగే వ్యక్తిగత మరుగుదొడ్లు, ఇంకుడుగుంతల బిల్లులు చెల్లించలేదంటూ పలువురు కూలీలు ఫిర్యాదు చేశారు. దీంతో ఆమె శనివారం విచారణ చేపట్టారు. అధికారులు పీల్డ్ అసిస్టెంట్‌ను ప్రశ్నించగా, అప్పట్లో ప్రభుత్వం అందజేసిన గునపాలను, టెంట్లను కూలీల గ్రూపులకు అందజేశామని తెలిపారు. కూలీల ఫిర్యాదు మేరకు ఫీల్డ్ అసిస్టెంట్ 2021 ఏప్రిల్ నుంచి సస్పెండ్‌లో ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ విచారణలో ఎంపిడిఒ సీపాన హరిహరరావు, ఎపిఒ శ్రీనివాసరావు పాల్గొన్నారు.


విచారణ చేస్తున్న అధికారులు

'ఆసరా'కు బయోమెట్రిక్ తప్పనిసరి

ప్రజాశక్తి- బూర్జ

మండలంలోని అన్ని డ్వాక్రా సంఘాల సభ్యులు వైఎస్ఆర్ ఆసరాకు బయోమెట్రిక్ తప్పసరిగా వేయాలని డిఆర్‌డిఎ పీడీ విద్యాసాగర్ అన్నారు. స్థానిక ఐకెపి కార్యాలయాన్ని శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైఎస్ఆర్ మూడో రుణమాఫీ డబ్బులు లబ్ధిపొందేందుకే ఈ బయోమెట్రిక్ నిర్వహిస్తున్నారని అన్నారు. గ్రామస్థాయిలో విఎఎలు ఇంటింటికీ వెళ్లి మహిళా సంఘాల సభ్యులకు అవగాహన కల్పించాలన్నారు. అలాగే ప్రతి సంఘానికీ నెలకు మూడుసార్లు సంఘ సమావేశాలు నిర్వహించి రికార్డులను సక్రమంగా నిర్వహించాలన్నారు.

కొంచాడలో పారిశుధ్య పనులు


పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ అనురాధ

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని కొంచాడలో శనివారం ముమ్మరంగా పారిశుధ్య పనులను చేపట్టారు. గ్రామంలో కలెక్టర్ శ్రీకేశ్ లాఠకర్ శుక్రవారం సందర్శించినప్పుడు పారిశుధ్యం అధ్వానంగా ఉండడంపై ఆగ్రహించి పంచాయతీ కార్యదర్శిని సస్పెండ్ చేయాలని ఆదేశించారు. అలాగే 24 గంటల్లో పారిశుధ్య పనులు చేపట్టి కాలువలను శుభ్రం చేయించాలని సూచించారు. దీంతో కార్యదర్శి స్పందించి ప్రొక్లెయినర్‌తో అంగన్వాడీ కేంద్రం చుట్టూ చెత్తాచెదారాలను తొలగించారు. కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాలను తొలగించి శుభ్రం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పి.అనూరాధ, కార్యదర్శి ఎస్.రమేష్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న భాస్కరరావు

అందరి సహకారంతో గ్రామాభివృద్ధి

వజ్రపుకొత్తూరు: అందరి సహకారంతో గ్రామాభివృద్ధి సాధ్యమవుతుందని పల్లివూరు సర్పంచ్ మామిడి భాస్కరరావు అన్నారు. మండలంలోని హుకుంపేటలో శనివారం విలేకరులతో మాట్లాడారు. పంచాయతీ అభివృద్ధికి మంత్రి అప్పలరాజు రూ.20 లక్షలు నిధులు కేటాయించారని, అందుకు ధన్యవాలని అన్నారు. శుక్రవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం విజయవంతం చేసిన గ్రామస్తులకు అభినందనలు తెలిపారు. ప్రభుత్వ పథకాలపై ప్రజల్లో మంచి స్పందన అవగాహన ఉన్నాయన్నారు. గ్రామంలో ప్రతి కుటుంబానికీ ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకుందని, అలాగే సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, నాడు-నేడు ద్వారా స్కూల్ అభివృద్ధి చేస్తూ గ్రామాభివృద్ధికి ప్రభుత్వం ఎంతో తోడ్పడిందని గ్రామస్తులు అభిప్రాయపడుతున్నారని అన్నారు. ఈయనతో పాటు ఎంపిపి ప్రతినిధి ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్, మండల అధ్యక్షులు పుక్కల గురయ్యనాయుడు, కొర్రయి గిరిబాబు అవగాన లింగరాజు, గురుప్రసాద్, ఉపేంద్ర పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం

ప్రజాశక్తి- ఆమదాలవలస

సైబర్ నేరాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సిఎఫ్ఎల్ కో-ఆర్డినేటర్ చిగురుపల్లి వెంకటేష్ (చిన్ను) అన్నారు. మండలంలోని బొబ్బిలిపేటలో ఆర్‌బిఐ పథకంలో భాగంగా యూనియన్ బ్యాంకు సౌజన్యంతో ఎస్ఎస్‌టి స్వచ్ఛంద సంస్థ నిర్వహణలో ఆర్థిక అక్షరాస్యతపై శనివారం అవగాహన కల్పించారు. డిజిటల్ పేమెంట్స్ వల్ల కలిగే లాభాలను ప్రజలకు వివరించారు. రూపే, ఎటిఎం కార్డు వల్ల కలిగే ప్రయోజనాలను తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు ఇన్సూరెన్స్ పథకాలను గురించి విపులంగా వివరించారు. సైబర్ మోసాలకు గురైనప్పుడు 1930 టోల్ ఫ్రీ నంబరుకు, ఇంటిగ్రేటెడ్ అంబుడ్స్‌మెన్ 14448 టోల్ ఫ్రీ నంబర్లకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చునని పేర్కొన్నారు. ఎటిఎం కార్డుల వెనక పిన్ నంబరును రాయవద్దని సూచించార. కార్యక్రమంలో సిఎఫ్ఎల్ సిబ్బంది రామారావు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న వెంకటేష్

రికార్డుల పరిశీలన

మెళియాపుట్టి: మండలంలోని కోసమాల పంచాయతీలో ప్రజాధనం దుర్వినియోగమైందని అదే గ్రామానికి చెందిన ఎస్.గంగాధర్ సిఎం కార్యాలయానికి ఇటీవల ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కలెక్టర్ కార్యాలయం నుంచి జిల్లా ఆడిట్ అధికారి ప్రభావతి కోసమాల సచివాలయంలో శనివారం రికార్డులను తనిఖీ చేశారు. పూర్తిస్థాయి తనిఖీ నిర్వహించాల్సి ఉందని, ఇప్పటి వరకు నిర్వహించిన వివరాలు కలెక్టర్‌కు అందజేస్తామని తెలిపారు.

బావాజీ మఠం పీఠాధిపతిగా లక్ష్మీధార

శ్రీకాకుళం అర్బన్ : నగరంలోని బొందిలీపురంలో ఉన్న జగన్నాథస్వామి ఆలయానికి చెందిన బావాజీ మఠం పీఠాధిపతిగా లక్ష్మీధార భావాజీ నియమితులయ్యారు. గతంలో పీఠాధిపతిగా ఉన్న సదావర్త పలహార మహంతి రఘువీర్ బావాజీ ఇటీవల మృతి చెందారు. ఆయన స్థానంలో లక్ష్మీదార బావాజీని పూరీమ ఠాధిపతులు నియమించా రు. ఈ మేరకు శనివారం బాధ్యతల స్వీకరించారు. ఈ మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి పాల్గొని అభినందించారు. కార్యక్రమంలో కొంద్రు పాపారావు, సంతోష్ పాణిగ్రహీ, హరిదేవ్ పాల్గొన్నారు.

అన్నదాతలో గుబులు

టెక్కలి: ఆరుగాలం శ్రమించి పండించే అన్నదాత గుండెల్లో గుబులు రేగుతుంది. మరికొద్ది రోజుల్లో అల్పపీడన ప్రభావం ఉందన్న వాతావరణ కేంద్ర హెచ్చరిక మేరకు చేతికొచ్చిన వరి పంటను కాపాడుకునేందుకు ఆరాటపడుతున్నారు. యుద్ధప్రాతిపదికన వరిచేను కోతలు కోసి కుప్పలు పెడుతున్నారు.

పెట్రోల్ బంకును తొలగించాలి


దీక్ష చేస్తున్న రాజాశ్రీకాంత్

ప్రజాశక్తి- పలాస

పలాస ప్రభుత్వ జూనియర్ కళాశాల పక్కన గతంలో నిర్మించిన పెట్రోల్ బంకును తక్షణమే తొలగించాలని కాశీబుగ్గ వైశ్య సంఘం అధ్యక్షుడు కొంచాడ రాజా శ్రీకాంత్ డిమాండ్ చేశారు. కాశీబుగ్గ గాంధీ విగ్రహం వద్ద శనివారం నిరవధిక నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కళాశాల, హైస్కూల్‌లో రెండు వేల మంది విద్యార్థులు చదువుతున్నరని, వారికి ప్రమాదం జరుగుతుందని తెలిసినా పెట్రోల్ బంకును ఏర్పాటు చేశారని అన్నారు. ఈ విషయాన్ని పాలకులకు, అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించకపోవడంతో నిరవధిక దీక్షకు పూనుకున్నానని అన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు సాయంత్రం శిబిరం వద్దకు చేరుకుని దీక్షను భగ్నం చేసి వారిని పోలీస్ స్టేషన్ తరలించారు. దీక్షకు ఎంపిపి ఉంగ ప్రవీణ, వైసిపి నాయకులు ఉంగ సాయికృష్ణ, విద్యార్థి సంఘాల సంఘీభావం తెలిపారు.

పాఠశాలల సందర్శన

ఇచ్ఛాపురం : నాడు-నేడు పనులను వేగవంతం చేయాలని, ప్రభుత్వ ఆదేశాల మేరకు మారిన మెనూ ప్రకారం భోజనాలు పెట్టాలని వెలుగు ఎపిఎం ప్రసాదరావు అన్నారు. మండలంలోని తులిసిగాంలో నాడు-నేడు పనులు, మధ్యాహ్న భోజనం పథకాన్ని శనివారం సిచివాలయ సిబ్బంది, పేరెంట్స్ కమిటీ సిసి, విఒఎలతో కలిసి సందర్శించారు. పిల్లలందరికీ సకాలంలో మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా? లేదా? నీటి సదుపాయం కల్పిస్తున్నారా? పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నాయా? లేవా? అని పరిశీలించారు. ఈయన వెంట సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ రవి, సిసి మోహనరావు ఉన్నారు.

పలాస : పిల్లలకు చదువుతో పాటు పౌష్టికాహారం అందించాలని మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యులు బమ్మిడి సంతోష్ కుమార్ సూచించారు. కాశీబుగ్గ సాయి కాలనీ ప్రైమరీ స్కూల్‌ను సందర్శించారు. పిల్లలకు పెట్టే మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో పాటు ఆయన భోజనం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు భైరవ శ్రీనివాస్, పైలా సంజయ్ తదితరులు పాల్గొన్నారు.


ఇచ్ఛాపురం :పరిశీలిస్తున్న ఎపిఎం ప్రసాదరావు